క్లుప్తంగా

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక


స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ నూర్జహాన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కార్పొరేటర్లు అర్జీ సత్యవతి, కార్పొరేటర్ ఉప్పల సుజాత, గునుపూడి శ్రీనివాసరావు, దారపు అనుషా, సబ్బన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి శనివారం ఉదయం మేయర్ నూర్జహాన్ తన చాంబర్‌లో నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నగర్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కో ఆప్షన్ సభ్యులు పెదబాబు, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ పాము శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ మహాసభ

ఏలూరు రూరల్ : ఏలూరు శివారు వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ 33వ అంతర్జాతీయ మహాసభ శనివారం ప్రారంభమైంది. వట్లూరు శ్రీ కన్వెన్షన్ హాల్లో చేపట్టిన ఈ సభకు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వాకర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరిపల్లి మురళీమోహన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వాకర్స్ రామానందం, ఎంవీ సుబ్బారెడ్డి, సీహెచ్ సీతారామయ్య తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అసోసియేషన్స్, క్లబ్బులు, రీజియన్స్, జోన్స్ చైర్మన్లు, జిల్లా గవర్నర్లకు ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు చేతుల మీదగా ఉత్తమ సేవా అవార్డులు అందించారు. నృత్య భారతి సంస్థ ఆద్వర్యంలో చిన్నారులు చేపట్టిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

19 మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 19 మంది నిరుద్యోగ యువతీయువకులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్ జితేంద్ర తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ మేళాకు 52 మంది యువతీ యువకులు హాజరైనట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, లగ్జరీ ల్యాండ్ లార్డ్, శ్రీరామ్ చిట్ ఫండ్స్ కంపెనీల ప్రతినిధులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, కోఆర్డినేటర్ రామకృష్ణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అవుట్ పోస్టులు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పట్టించుకోని పోలీస్ అధికారులు


పవర్‌పేట స్టేషన్ ఎదురుగా వైన్‌షాప్ పక్కన పోలీస్ అవుట్‌పోస్ట్


పవర్‌పేట పోలీస్ అవుట్ పోస్టు ఇలా..


నిరుపయోగంగా తంగెళ్లమూడి వంతెన వద్ద పోలీస్ అవుట్ పోస్ట్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రజలకు పోలీస్ సేవలను చేరువ చేయటంతోపాటు విజిబుల్ పోలీసింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన పోలీస్ అవుట్ పోస్టులు నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వీటిని రాత్రి, పగలు తేడా లేకుండా మందు బాబులు, యువత వినియోగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

- పవర్‌పేట రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరింది. 2007 ఆగస్ట్ 2న అప్పటి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా పనిచేసిన ఎం.జగన్‌మోహన్‌రెడ్డి పోలీస్ అవుట్‌పోస్టును ప్రారంభించారు. ఏలూరు డీఎస్పీగా ప్రేమ్‌కుమార్, టౌన్ సీఐగా విజయపాల్ పనిచేసిన సమయంలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. దీని పక్కనే ప్రస్తుతం మద్యం దుకాణం ఏర్పాటు కావటంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రైల్వే స్టేషన్‌లో దిగి బయటకు వచ్చే ప్రయాణికులు, మహిళలకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు.
- ఏలూరు తంగెళ్లమూడి, కండ్రికగూడెం సెంటర్లలో ఏర్పాటుచేసిన పోలీస్ అవుట్‌పోస్టులు నిరుపయోగంగా మారాయి. కండ్రికగూడెం సెంటర్‌లోని పోలీస్ అవుట్‌పోస్ట్ కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు వీటిపై దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

భరోసా కల్పించాలి



నిరుపయోగంగా మారిన పోలీస్ అవుట్‌పోస్టులపై పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మద్యం దుకాణాలు ప్రజల ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం కల్పిస్తున్నారు. పవర్‌పేట రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అవుట్‌పోస్ట్ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఇలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించి ప్రజలకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలి.

– వైఎస్‌వీ శివరావు, జేసీఎస్ కన్వీనర్, ఏలూరు

బాలింతలు, పిల్లల పట్ల జాగ్రత్తలు అవసరం


ప్రీ స్కూల్ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): బాలింతలు, పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి కోరారు. స్థానిక 41వ డివిజన్ పరిధిలోగల రెహమత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం నెలవారి సెక్టార్ మీటింగ్‌లో భాగంగా ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించినారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మవతి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు చిన్నారులకు హగ్గీస్‌ను సీడీపీఓ పద్మవతి చేతుల మీదగా బాలింతలకు అందజేశారు. ఎస్‌బీజే, సీఎస్ఆర్ వారు ప్రీ స్కూల్ పిల్లలకు పుస్తకాలు, వాటర్ బాటిల్, రైస్ కుక్కర్, ప్లేట్లు, గ్లాసులు, బాక్స్‌లు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం దేవి, మోనిక, అంగన్‌వాడీలు, తల్లులు పాల్గొన్నారు.

హైటెక్ హరిదాసు



ధనుర్మాసం ప్రారంభమైందంటే చాలు వీధుల్లో పాదాలకు చెప్పులు లేకుండా నడుస్తూ చేతిలో చిడతలు పెట్టుకొని తలపై అక్షయపాత్ర పెట్టుకొని హరిలో రంగ హరి అనే హరినామ సంకీర్తనలు చేస్తుంటారు. మారుతున్న ట్రెండ్‌ను బట్టి హరిదాసుల్లోనూ మార్పువచ్చింది. ఒక వాహనానికి మైక్, వాహనం ముందు పాత్ర ఫిక్స్ చేసుకుని వీధుల్లో సంచరిస్తున్నారు. ఏలూరు వీధుల్లో వాహనంపై తిరుగుతున్న సత్తుపల్లికి చెందిన కె.దుర్గారావు హరిదాసు దృశ్యమిది. ఈ ఒక్క నెల మాత్రమే తిరుగుతానని, మిగిలిన రోజుల్లో బట్టల వ్యాపారం చేసుకుంటానని ఆయన తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

సినీ చరిత్రలో అక్కినేని అధ్యాయం ప్రత్యేకం


అక్కినేని గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతీయ చలనచిత్ర చరిత్రలో దివంగత అక్కినేని నాగేశ్వర రావు అధ్యాయం ప్రత్యేకమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షరీఫ్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం, సీఆర్ రెడ్డి కళాశాల సాంస్కృతిక విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శత వసంతాల అక్కినేని స్వరాంజలి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్కినేని నవలా నాయకుడని, గొప్ప రచయితలు సృష్టించిన పాత్రలకు ఆయన జీవం పోశారని, ఆయన నట జీవిత తొలినాళ్లలోనే శరన్నవల దేవదాసు పాత్ర పోషణ భారతీయ నటులకు ఒక నిఘంటువుగా ఉపయోగపడిందని వివరించారు. తెలుగు చలనచిత్రాల్లో పాటలకు నృత్యాలను జోడించి కొత్త రూపు తీసుకురావడం అక్కినేనితోనే ప్రారంభమైందన్నారు. మధ్యాహ్నం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో సీఆర్ఆర్ అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమెహన్ మాట్లాడుతూ విద్యార్థులకు సంగీతం, సాహిత్యాల గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ ఘంటసాల, అక్కినేని నాగేశ్వరరావు జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు నటించిన చలన చిత్రాల్లోని పాటలను ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన పాటలను ఎస్ఎం సుభాని, ఈటీ అర్జునరావు, శ్రీవల్లీ సరస్వతి, ఆశ శ్రావ్యంగా ఆలపించారు. ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభాని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఇఫ్టూనగర కార్యదర్శి శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇఫ్టూ ఏలూరు నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఇఫ్టూ అనుబంధ మార్కెట్ యార్డ్ కూరగాయల వర్కర్స్ యూనియన్ 35వ వార్షిక సభ ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో యూనియన్ ప్రెసిడెంట్ బాడిత వీరభద్రం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు భద్రత, ఉపాధి రక్షణకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. హామీలను అమలు చేయలేని పక్షంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఒక సమర శీలఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. సభకు రంగాల నూకరాజు, బాలాజీ, పెంటయ్య నాని, అప్పారావు, శ్రీనివాసరావు, సాయి, పవన్, కళ్యాను రాజు, సాయిరాం, బి.అప్పారావు, తదితరులు నాయకత్వం వహించారు.

శ్రీవారి సప్తాహాలు ప్రారంభం




విశేష అలంకరణలో శ్రీవారు, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, సప్పా భారతి భాగవతారిణి హరికథా కాలక్షేపం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఆయన స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ శ్రీమత్ భాగవత వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన సప్పా భారతి భాగవతారిణి శ్రీ వేంకటాచల మహత్యంపై హరకథా కాలక్షేపం నిర్వహించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాత దీప్తికి విరాళం బాండ్ పత్రం అందిస్తున్న ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన మొగలాపు దీప్తి శనివారం రూ.1,00,011 విరాళంగా అందజేశారు. తొలుత కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి క్షేత్రంలో కోలాహలం


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారికి ప్రీతికరమైనరోజు కావడంతో ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. అనివేటి మండపంలో పలువురు మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం రద్దీ మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆలయ వార్గాలు భావిస్తున్నాయి.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	08
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	40
బెండకాయలు	38	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28-32	కంద	60
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	50
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	60-86
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	28-36	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

ఆఖరి మజిలీకీ అవస్థలే..

- ఆక్రమణల చెరలో కొత్తగూడెం శ్మశాన వాటిక
- అంత్యక్రియల నిర్వహణ సమయంలో ఇక్కట్లు
- చెరువు చుట్టూ తుప్పలు పెరిగి దారి లేని వైనం



కొత్తగూడెం శ్మశాన వాటిక ఆక్రమణకు గురైన దృశ్యం, శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న చెరువుకు వెళ్లే మార్గంలేదు (ఇన్‌సెట్‌లో)

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెం కొత్తగూడెంలో శ్మశాన వాటిక సమస్యతో స్థానిక ప్రజలు ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాన్ని ఆనుకుని పీసపాటివారి చెరువు 8 ఎకరాల 66 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. దానిలో పక్కన రెండు ఎకరాల్లో శ్మశాన వాటికగా గ్రామస్తులు వినియోగించుకునేవారు. ఆ చెరువుని ఆనుకుని ఉన్న రైతులు శ్మశాన వాటిక భూమిని మూడొంతుల్లో రెండు వంతులు ఆక్రమించుకున్నారు. దాంతో కొత్తగూడెంలో పలు సామాజిక వర్గాల ప్రజలు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు, దహన సంస్కారాలు చేయడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులో నీరు పొంగిపొర్లుతోంది. దీంతో దహన సంస్కారాల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శవాన్ని శ్మశానంలో ఉంచి చిట్టడవిలా పెరిగిన తుప్పలను శుభ్రం చేసుకున్న అనంతరం ఖననం, లేదా దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన యువకులు నడుం బిగించారు. ఆక్రమణలు తొలగించి శ్మశాన వాటికను రక్షించాలని తహసీల్దారు ప్రసాదుకు, ఎంపీడీవో రాజ్‌మనోజుకు ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీ అందజేశారు. శ్మశాన వాటిక భూమిని ఆక్రమణ చెర నుంచి రక్షించాలని ఫిర్యాదులో ప్రజలు అధికారులను కోరారు.

సరైన దారి లేదు



కొత్తగూడెం గ్రామంలో శ్మశాన వాటికలో మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా తయారైంది. చెరువుగట్టునే శ్మశాన వాటిక ఉంది. పక్కనే ఉన్న రైతు ఈగట్టును ఆక్రమించడంతో శ్మశాన వాటిక స్థల విస్తీర్ణం తగ్గుతోంది. సరైన దారి లేక అంత్యక్రియల నిర్వహణకు వెళ్లే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– ముక్కుగంగమ్మ, కొత్తగూడెం

స్నానానికి అవకాశం లేదు



శ్మశాన వాటికలోని చెరువుకు వెళ్లేందుకు సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిమొక్కలు పెరిగి రుద్ర భూమి చిట్టడవిని తలపిస్తోంది. సమీప గ్రామాల్లో శ్మశాన వాటికల్లో స్నానాలకు షైపులు అమర్చారు. రోడ్డు, నీటి వసతి తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మాగంటి పెద్దింట్లు, కొత్తగూడెం

బహుముఖ ప్రజ్ఞాశాలి జయపాల్ సింగ్ ముండా

బుట్టాయగూడెం: ఆదివాసీల హక్కుల కోసం పోరాడి, వాటిని రాజ్యాంగంలో చేర్పించిన బహుముఖ ప్రజ్ఞశాలి జైపాల్ సింగ్ ముండా అని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినా పురపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఆదివాసీ మహాసభ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జైపాల్ సింగ్ ముండా చిత్రపటాలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. దేశానికి గోల్డ్ మెడల్ సాధించిన తొలి గిరిజన క్రీడాకారుడైన జైపాల్ సింగ్ ముండా పేరుతో క్రీడాకారులకు అవార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత కార్యాలయంలోని జైపాల్ సింగ్ ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కోర్టు ఆదేశాల ఉల్లంఘనే

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఏపీఓ హై కోర్టు ఆదేశాలను ప్రభుత్వం ఉల్లంఘించిందని సూర్యనారాయణ ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేయాలని, కొత్త భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం ఎకరం చొప్పున భూమి కేటాయించాల్సి ఉందని తెలిపారు. నిర్వాసితులవుతున్న వారిలో 56,495 కుటుంబాలు ఎస్టీలు, 7,134 కుటుంబాలు ఎస్సీలు ఉన్నారని తెలిపారు. వీరిలో 10 శాతం మందికి మాత్రమే భూములు ఉన్నాయని చెప్పారు. 50 వేలకు పైగా భూమిలేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నారని వివరించారు. వీరికి సుమారు 50 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నా ప్రభుత్వం ఇప్పటివరకూ 426 ఎకరాలు మాత్రమే కొండమొదలు నిర్వాసితుల కోసం సేకరించిందని తెలిపారు. 18 ఏళ్ల నిండిన వారికి ప్యాకేజీ చెల్లించాల్సి ఉందన్నారు.